క్లుప్తంగా

విశాఖ శారదా పీఠంలో ఎమ్మెల్యే రామిరెడ్డి



స్వరూపానంద సరస్వతి ఆశీర్వచనాలు అందుకుంటున్న రామిరెడ్డి

కావలి : విశాఖపట్నంలోని శారదా పీఠాన్ని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం సందర్శించారు. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి శారదా పీఠంలోని శారదా స్వరూప రాజశ్యామలా అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠంలోని ఇతర ఆలయాలను కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శారదా పీఠాధిపతి స్వరూపానంద సరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి ఆశీర్వచనాలు అందుకున్నారు.

ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ కోర్సులు

ఉదయగిరి : మండలంలోని జలదంకి, సోమవరప్పాడు ఉన్నత పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ఎంఈఓ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు పాఠశాలల్లో బాలబాలికలకు ఎంపీసీ, సీఈసీ గ్రూపులు ప్రారంభిస్తున్నట్లు తెలియజేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఉదయగిరి : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జలదంకి ఎస్సై ఆదిలక్ష్మి తెలిపారు. ఆమె తన కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. మండల పరిధిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రజలు సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీల వర్గాలు, నాయకులు, కార్యకర్తలు గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అకౌంట్లకు పింఛన్ నగదు

అల్లూరు : జూన్ నెలలో కూడా పింఛన్‌దారుల అకౌంట్లకు పెన్షన్ నగదును జమ చేస్తారని ఎంపీడీఓ జ్యోతి బుధవారం తెలియజేశారు. ఎన్నికల నియమావళిలో భాగంగా అల్లూరు మండల పరిధిలో 75 శాతం పింఛన్‌దారులకు వారి అకౌంట్‌లో నగదు జమ అవుతుందని, వికలాంగులు, మంచానికి పరిమితమైన వారికి, బ్యాంక్ అకౌంట్ లేనివారికి సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి నగదును అందజేస్తారని తెలియజేశారు.

పెద్దిరెడ్డిపల్లిలో ‘ఫ్యామిలీ డాక్టర్’

వరికుంటపాడు : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో మండల వైద్యాధికారిణి కరిష్మా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 45 మంది రోగులను పరీక్షించి మందులను ఉచితంగా అందించారు. అనంతరం ప్రజలకు వైద్య సలహాలు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు.

ఎండలతో జాగ్రత్తగా ఉండండి

చేజర్ల : వేసవి దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చేజర్ల పీహెచ్‌సీ వైద్యురాలు మెహతాబ్ అన్నారు. ఆమె బుధవారం మాట్లాడుతూ గడిచిన మూడు రోజులు కాస్త చల్లగా అనిపించినా రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్నారు. చల్లటి నీరు, మజ్జిగ, కొబ్బరినీరు తీసుకోవాలన్నారు. మాంసాహారం తగ్గించి, తేలికగా జీర్ణమయ్యే కాయగూరలు, పండ్లు తీసుకోవాలన్నారు.

విద్యుత్ మీటర్లకు జియో ట్యాగింగ్ చేయాలి

ఉదయగిరి : మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో విద్యుత్ మీటర్లను గుర్తించి జియో ట్యాగింగ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఈఓపీఆర్డీ ఎస్.మల్లికార్జున పంచాయతీ, సచివాలయ కార్యదర్శులకు సూచించారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పంచాయతీకి సంబంధించిన భవనాలు, తాగునీటి పథకాలు, వీధిలైట్ల మీటర్లను గుర్తించి జియో ట్యాగింగ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. చెల్లించిన విద్యుత్ బిల్లుల వివరాలను కూడా పొందుపరచాలని తెలిపారు. గణాంకాల ప్రకారం మండలంలో 241 విద్యుత్ మీటర్లు ఉన్నాయన్నారు. సచివాలయ పరిధిలోని ఎనర్జీ అసిస్టెంట్ల సహాయంతో మీటర్లను గుర్తించాలన్నారు. ఈ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

వైద్యసేవలను వినియోగించుకోవాలి

చేజర్ల : గ్రామాల్లో 104 వాహనాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ మెహతాబ్ కోరారు. మండలంలోని తూర్పుకంభంపాడు ఆరోగ్య ఉపకేంద్రంలో 104 వాహనం ద్వారా బుధవారం రోగులకు వైద్యసేవలందించారు. పలువురు రోగులకు రక్త, ఇతర పరీక్షలు చేసి మందులను అందించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ చంద్రయ్య, వైద్యసిబ్బంది మస్తానమ్మ, పద్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందరి చూపు ఉదయగిరి వైపు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఉదయగిరి నియోజకవర్గ ఫలితాలపైనే అందరి చూపు ఉంది. ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ఇద్దరూ రాజకీయాలకు కొత్తవారు కావడంతో విశిష్టత నెలకొంది. కాగా మరో ఐదు రోజుల్లో కౌంటింగ్ ప్రక్రియ జరగనుండగా రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అన్నివర్గాల ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి తమను గెలిపిస్తాయని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధీమాతో ఉన్నారు.



ఉదయగిరి దుర్గం

- 23 రౌండ్లలో గిరి ఫలితం
- ప్రధాన పార్టీల అభ్యర్థులు కొత్తవారే
- వైఎస్సార్‌సీపీ వైపే నియోజకవర్గ ప్రజలు

ఉదయగిరి : ఈనెల 13వ తేదీ సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. నియోజకవర్గంలోని 323 పోలింగ్ కేంద్రాల్లో 1,97,970 ఓట్లు పోలైంది. వీటికి సంబంధించి కౌంటింగ్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం 23 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,493 పోలైంది. వీటి కోసం అదనంగా మరో టేబుల్‌ను ఏర్పాటు చేస్తారు. తుది ఫలితం కోసం 23 రౌండ్లు వేచి ఉండాల్సిందే.

గతంలో..

నియోజకవర్గంలో 1999 నుంచి కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తే.. టీడీపీ అభ్యర్థి కంభం విజయరామిరెడ్డి సమీప కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిపై 4,775 స్వల్ప ఓట్లతో గెలుపొందారు. అప్పట్లో వరికుంటపాడు మండలంలో టీడీపీకి వచ్చిన 4,500 మెజారిటీ కంభంను గెలిపించింది. 2004లో కంభంపై మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి 23,075 ఓట్లతో గెలిచారు. అప్పుడు సీతారామపురం, ఉదయగిరి మండలాల ఓట్లు మేకపాటికి అనుకూలించాయి. 2009 ఎన్నికల్లో కూడా మరోసారి కంభంపై మేకపాటి 13,482 ఓట్లతో గెలిచారు. అప్పుడు కూడా ఆ రెండు మండలాల్లో మేకపాటికి మంచి మోజారిటీ వచ్చింది. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంతో జరిగిన 2012 ఉప ఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మరోసారి సంచలన విజయం సాధించారు. అప్పటి టీడీపీ అభ్యర్థి బొల్లినేని రామారావుపై 30,598 ఓట్ల మెజార్టీ సాధించారు. అప్పుడు కూడా సీతారామపురం, ఉదయగిరిలో మేకపాటికి మంచి మెజారిటీ రావడంతో పాటు అన్నీ మండలాలల్లో కూడా వైఎస్సార్‌సీపీకి భారీగా ఓట్లు పోలయ్యాయి. 2014 ఎన్నికల్లో కౌంటింగ్ ప్రక్రియ ఉత్కంఠగా సాగింది. మేకపాటి, బొల్లినేని మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో 3,622 స్వల్ప మెజారిటీతో బొల్లినేని గెలిచారు. సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కొండాపురం మండలాల లెక్కింపు వరకు గట్టి పోటీ ఉండగా, కలిగిరి మండలంలో టీడీపీకి మెజారిటీ రావడం, జలదంకిలో వైఎస్సార్‌సీపీకి అనుకున్నంత మెజారిటీ రాకపోవడంతో మేకపాటికి పరాభవం తప్పలేదు. అయితే 2019 ఎన్నికల్లో వార్ వన్‌సైడ్‌గా జరిగింది. బొల్లినేనిపై మేకపాటి 35,526 ఓట్లతో భారీ విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ తరఫున కాకర్ల సురేష్, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఇద్దరూ రాజకీయాలకు కొత్త వారు కావడం విశేషం.

సీతారామపురంతో కౌంటింగ్ మొదలు

మొదటగా సీతారామపురం మండలంలోని చిన్నాంగంపల్లి నుంచి కౌంటింగ్ మొదలై బూత్ నంబర్ 26 పడమటి రొంపిదొడ్లతో పూర్తవుతుంది. తర్వాత ఉదయగిరి మండల కౌంటింగ్ జరుగుతుంది. అనంతరం వరికుంటపాడు, దుత్తలూరు మండలాల ఓట్లను లెక్కిస్తారు. దీంతో ఫలితంపై స్పష్టత వస్తుంది. అనంతరం వింజమూరు, కొండాపురం, కలిగిరి మండలాల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. చివరగా జలదంకి ఓట్లను లెక్కిస్తారు.

ప్రశాంతతకు విఘాతం కలిగిస్తే కేసులు

ఉదయగిరి : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ప్రశాంతతకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదు చేస్తామని ఉదయగిరి ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు, సీఐ వేల్పుల గిరిబాబు హెచ్చరించారు. మండలంలోని దాసరపల్లి, దుర్గంపల్లి గ్రామాల ప్రజలతో బుధవారం వారు మాట్లాడారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఫలితాలు వచ్చినా శాంతీయుతంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురికి మించి గుమిగూడడం, బాణసంచా కాల్చడం, ఊరేగింపులు లాంటి కార్యక్రమాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. గ్రామాల్లో అశాంతి కలిగిస్తూ సంఘ విద్రోహ కార్యక్రమాలకు పాల్పడే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని తెలిపారు.అనంతరం ఆయా గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు.



ఉదయగిరి : దాసరపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, పోలీసులు

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సోమశిల : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని అనంతసాగరం తహసీల్దార్ నరసింహారావు హెచ్చరించారు. అనంతసాగరం మండల పరిధిలోని బొమ్మవరం, అగ్రహారం గ్రామాల్లో తహసీల్దార్ బుధవారం క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో కౌంటింగ్ సమయంలో ర్యాలీలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదవుతాయని తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, వీఆర్వో నాగేంద్ర, కానిస్టేబుల్ నారాయణ తదితరులు ఉన్నారు.



సోమశిల : ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ నరసింహారావు

సంగంలో మార్చ్ ఫాస్ట్

సంగం : సంగం మండల కేంద్రంలో సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులతో బుధవారం మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాణసంచా కాల్చినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, ప్రజలు గుంపులుగా తిరగకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు.

చెన్నవరప్పాడులో..

మండలంలోని చెన్నవరప్పాడు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.



సంగంలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న పోలీసులు

జక్కా వెంకయ్యకు ఘన నివాళి



ఆత్మకూరు సీపీఎం కార్యాలయంలో జక్కా వెంకయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు



ఉదయగిరి పట్టణంలో..

ఆత్మకూరు : జిల్లా కమ్యూనిస్ట్ యోధుడు, మాజీ శాసనసభ్యుడు జక్కా వెంకయ్య వర్ధంతిని పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సీపీఎం కార్యదర్శి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో జక్కా వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జోహార్ వెంకయ్య అంటూ నినాదాలు చేశారు. ఆయన సేవలు గురించి నాయకులు వివరించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు జి.లక్ష్మీపతి, షేక్.సంధానీ, ఎ.నాగయ్య, శివప్రసాద్, హజరత్తయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- **ఉదయగిరి :** జలదంకిలోని సీపీఎం కార్యాలయంలో జక్కా వెంకయ్య వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నేత తాళ్లూరి మాల్యాద్రి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, అక్షరాస్యత, సారా వ్యతిరేక ఉద్యమాల్లో జక్కా వెంకయ్య చేసిన పోరాటాలు ఎనలేనివన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి ఆంటోనీబాబు, రైతు సంఘ నేత రావి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.
- **మర్రిపాడు :** మండల కేంద్రంలోని సీపీఎం భవన్‌లో జక్కా వెంకయ్య వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు మూలి వెంగయ్య, సీపీఎం మండల కార్యదర్శి సయ్యద్ రహంతుల్లా, సీఐటీయూ మండల కార్యదర్శి బత్తల రత్తయ్య, మాజీ సర్పంచ్ ఇమామ్ ఖాసీం, ఐద్వా మండలాధ్యక్షులు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.
- **ఉదయగిరి :** స్థానిక సీపీఎం కార్యాలయంలో జక్కా వెంకయ్య వర్ధంతిని బుధవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘ నేత కాకు వెంకటయ్య, ఎంపీటీసీ విజయమ్మ, నాయకులు పి.వెంకటేశ్వర్లు, శ్యామ్‌ప్రసాద్, జి.రామిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 571 మంది హాజరు

ఆత్మకూరు : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీఎస్సార్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను బుధవారం నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షలకు రెండు కేంద్రాల్లో మొత్తం 571 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన మొదటి సంవత్సర పరీక్షకు 270 మంది విద్యార్థులకు 16 మంది గైర్హాజరు కాగా, 254 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ శ్రీవాణి తెలిపారు. బీఎస్సార్ కళాశాలలో మొదటి సంవత్సర ఇంటర్ పరీక్షకు 182 మంది విద్యార్థులకు 19 మంది గైర్హాజరు కాగా, 163 మంది హాజరైనట్లు చీఫ్ అధికారి లవకుమార్ తెలిపారు. ఈ కేంద్రంలోనే మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు 162 మందికి 8 మంది గైర్హాజరు కాగా 154 మంది హాజరైనట్లు ఆయన వివరించారు.

1న వీరాంజనేయుని జయంతి మహోత్సవం



దుత్తలూరు : జూన్ 1వ తేదీన దుత్తలూరు గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో జయంతి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సికుల్‌సెల్ వ్యాధితో రక్తహీనత

దుత్తలూరు : సికుల్‌సెల్ వ్యాధితో ఎర్ర రక్తకణాలు ఉత్పత్తికాక రక్తహీనతకు గురవుతారని దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. మండలంలోని వెంకటంపేట ఎస్టీ కాలనీలో సికుల్ సెల్ వ్యాధి ర్యాపిడ్ టెస్టులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఎస్టీ కాలనీల్లో ఈ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సికుల్‌సెల్ అంతుపట్టని జన్యుపరమైన వ్యాధి అని వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జి.కిరణ్మయి, ఏఎన్ఎం వై.ప్రశాంతి, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థులకు అభినందన



500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులతో ఎంఈఓలు, సంఘ నేతలు

సంగం : మండల పరిధిలో పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సంగం జెడ్పీ హైస్కూల్లో అభినందన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంఈఓలు జానకీరామ్, మల్లయ్య, ఆపాస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ పాల్గొని 500కు పైగా మార్కులు సాధించిన 38 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆపాస్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దశయ్య, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిపై కేసుల నమోదు

- ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి

ఆత్మకూరు : ఎన్నికల కోడ్‌తో పాటు పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్న క్రమంలో నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి తెలిపారు. ఆత్మకూరులోని తన కార్యాలయంలో సీఐ జి.వేణుతో కలిసి ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని బసవరాజుపాళెం గ్రామంలో పోలేరమ్మ జాతరను పురస్కరించుకుని మంగళవారం రాత్రి ఓ ఈవెంట్ ఏర్పాటు చేశారని, ఈ విషయం తెలిసి సీఐ వేణు, ఎస్సై ముత్యాలరావు సిబ్బందితో గ్రామానికి వెళ్లి ప్రోగ్రామ్ జరగకుండా నిలిపివేశారన్నారు. నిబంధనలు అతిక్రమించి పోలీస్ అనుమతులు లేకపోయినా డ్యాన్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహించేందుకు సిద్ధమవుతున్న వారితో పోలీస్ సిబ్బందికి వాగ్వాదం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఓ కానిస్టేబుల్‌ను నెట్టారని తెలిపారు. పోలీస్ విధులకు ఆటంకం కలిగించడంతో గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తితో పాటు మరో ఐదుగురిపై, నెల్లూరుకు చెందిన స్వప్న ఈవెంట్స్ వారిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి కేసులు నమోదు చేయనున్నట్లు డీఎస్పీ వివరించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి పక్కన సీఐ వేణు

భూసార పరిరక్షణపై అవగాహన సదస్సు

వరికుంటపాడు : మండలంలోని వరికుంటపాడు గ్రామంలో వ్యవసాయాధికారి వి.రవికుమార్ రైతులకు భూసార పరిరక్షణపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరిరక్షణలో భాగంగా రైతులు పంట మార్పిడి ద్వారా తెగుళ్ల సమస్యను అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులను వాడడం వలన సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు నేలను సేంద్రియ కర్బనంతో నింపి ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చన్నారు. కొత్త తరం ఎరువులైన నానో యూరియా, నానో డీఏపీ వాడకం వల్ల నేల కాలుష్యాన్ని, నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. వ్యవసాయ సహాయకుడు కుండ్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులకు కావల్సిన పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసరలను 50 శాతం సబ్సిడీపై రైతు భరోసా కేంద్రం వద్ద పొందవచ్చు అని తెలిపారు.



మాట్లాడుతున్న ఏఓ రవికుమార్

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

ఉదయగిరి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్యను పెంచేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఉపాధిహామీ ఏపీఓ శ్రీనివాసరావు తెలిపారు. కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోజుకు 3,500 మంది కూలీలు పనులకు వస్తున్నారన్నారు. రోజుకు 5 వేల మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. పనుల వద్ద కూలీలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్తగా గుర్తించిన పనులను చేయించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ రవీంద్రబాబు, టీఏలు, ఎఫ్ఏలు, సీనియర్ మేట్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ శ్రీనివాసరావు

నాణ్యమైన భోజనం అందించాలి

ఉదయగిరి : విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ తోట శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని 69 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులతో ఎంఈఓ తోట శ్రీనివాసులు స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన కాయగూరలు, ఆకుకూరలు వాడాలన్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం వంట చేయాలన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి తగిన మోతాదులో పప్పుదినుసులు, నూనె తదితరాలు వాడాలన్నారు. పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో మధ్యాహ్న భోజన పథకం గురించి చర్చించి తెలియజేయాలన్నారు. వంటగది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్పీలు మొబీనా, చిన్నకృష్ణయ్య, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

అల్లర్లు జరగకుండా పటిష్ట చర్యలు

- ముమ్మరంగా కార్డన్ సెర్చ్

కావలి : కావలి నియోజకవర్గంలో కౌంటింగ్ సందర్భంగా అల్లర్లు జరగకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. కౌంటింగ్ ప్రక్రియకు మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో నియోజకవర్గ వ్యాప్తంగా కార్డన్ సెర్చ్, నాకాబందీ, అదనపు బలగాలతో గస్తీ, తదితర చర్యలను పోలీసులు ముమ్మరం చేశారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్‌తో పాటు ‘30 పోలీస్ యాక్ట్ కూడా అమల్లో ఉండడంతో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా నిబంధనలకు లోబడి నడుచుకోవాలని విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నారు. కావలి నియోజకవర్గంలో కౌంటింగ్ తరువాత అల్లర్లు జరిగేందుకు అవకాశాలు అధికంగా ఉండడంతో పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి వర్గీయులు ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా రాకపోతే విధ్వంసం సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఇందుకు సంబంధించి కావ్య వర్గీయులు వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నారు. కావ్య సోషల్ మీడియా పేరుతో కొంత మంది నకిలీ విలేకరులు వాట్సాప్ గ్రూపుల్లో కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు ముందస్తుగానే కఠిన చర్యలు చేపడుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలతో పాటు వివాదాస్పద వ్యక్తుల కదలికలపైన నిఘా ముమ్మరం చేశారు.

అనుమానం వస్తే బైండోవరే...

కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడే అవకాశం ఉందనే అనుమానం వస్తే చాలు పోలీసులు వెంటనే సంబంధిత వ్యక్తులను బైండోవర్ చేసుకుని అల్లర్లకు పాల్పడబోమని అండర్ టేకింగ్ రాయించుకుంటున్నారు. కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో ఇప్పటికే నియోజకవర్గంలో సుమారు 1,131 మందిని బైండోవర్ చేసుకున్నారు. కావలి సర్కిల్ పరిధిలో మొత్తం మూడు ఎస్‌హెచ్ఓ స్టేషన్లు, ఆరు పోలీస్ స్టేషన్‌లు ఉండగా ఆయా పరిధిలో 1131 మందిని బైండోవర్ చేసుకోవడంతో పాటు 167 మంది రౌడీషీటర్లను కూడా బైండోవర్ చేసుకున్నారు. ముందుగా గుర్తించిన పది సమస్యాత్మగా గ్రామాల్లో వరుసగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తూ పత్రాలు సరిగ్గా లేని వాహనాలను కూడా స్వాధీనం చేసుకుంటున్నారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా ఇప్పటి వరకూ కావలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 13 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు, ఎనిమిది ఐరన్‌రాడ్‌లు, ఆరు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. కావలి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 23 బైక్‌లు, ఒక ఆటో, కావలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు బైక్‌లు, బిట్రగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో 14 బైక్‌లు, ఒక ఆటో, అల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ముసునూరు, ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో చెక్‌పోస్టులు, కౌంటింగ్ సందర్భంగా అదనపు బలగాలను సిద్ధంగా ఉంచుతున్నట్లు కావలి డీఎస్పీ వెంకటరమణ తెలిపారు.